క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చొల్లంగిపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

గ్యాస్ ధర పెంపుపై ధర్నా

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలండర్ ధర పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శనివారం సాయంత్రం ధర్నా జరిగింది. ఎల్‌పీజీ గ్యాస్ సిలండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 ఒకేసారి పెంచడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. గ్యాస్ ధరలను రెండు నెలల వ్యవధిలో రెండు పెంచడం వల్ల సామాన్యులు, చిరు వ్యాపారాలు చేసుకునే వారికి మరింత ఆర్థిక భారం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు జి.దుర్గా ప్రసాద్, పి.వసంత కుమార్, టి.నాగ వరలక్ష్మి, దైవకృప, భువనేశ్వరి, అమూల్య రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాతాజీని కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్ కల్వకొలను తాతాజీని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక కల్వకొలను వీధిలోని తాతాజీ స్వగృహానికి ఇజ్రాయిల్ వెళ్లి ఆయనను సత్కరించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ పాల్గొన్నారు. అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన కల్వకొలను తాతాజీని మాదిగ ఉద్యోగల సంఘం నాయకులు శనివారం కలిసి అభినందించి సత్కరించారు.డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు ఆధ్వర్యంలో ఆ ఉద్యోగులు తాతాజీని కలిశారు.

ఐ.పోలవరం: ఎమ్మెల్సీగా ఎంపికైన తర్వాత మొదటిసారి మురమళ్ల విచ్చేసిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్, స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కంపూడి కిరణ్‌లను పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇజ్రాయెల్ మాట్లాడారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీ

తాళ్లరేవు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ఈ సోమవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం అన్నపూర్ణ శనివారం తెలిపారు. ఈ మేరకు మండలంలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి నివేదకలు సమర్పించనున్నట్టు తెలియజేశారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: గ్రామీణ ప్రాంతాల్లో అధ్వనంగా మారిన చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన అమృత్ సరోవర్ పథకంలో జరిగిన చెరువుల పనులను ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి శనివారం పరిశీలించారు. మండలంలోని గొల్లవిల్లి, భీయనపల్లి, విలసవిల్లి, మునిపల్లి, ఉప్పలగుప్తం గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు.

టోల్‌గేట్ ఫీజు వసూలు నిలిపివేయాలి

అమలాపురం టౌన్: అన్నంపల్లిలో 216 జాతీయ రహదారిపై కొత్తగా ఏర్పాటు చేసి ప్రారంభించిన టోల్గేట్ వద్ద వాహనాల ఫీజు వసూలు నిలిపివేయాలని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 216 జాతీయ రహదారికి సంబంధించి కోనసీమలోనే పలు చోట్ల రోడ్ల నిర్మాణం పూర్తి కాలేదని గుర్తు చేశారు. ఈ జాతీయ రహదారిని కనీసం కోనసీమలోనైనా నూరు శాతం నిర్మాణం పూర్తయిన తర్వాతే టోల్గేట్ చార్జీ వసూళ్లు చేసేలా కేంద్ర ఉపరితల రవాణా శాఖకు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సీపీఎం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతుందని వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

టోల్‌ఫీజు వసూలు తక్షణమే ఆపాలి

ముమ్మిడివరం: అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద టోల్ వసూలును తక్షణమే ఆపాలని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అన్నంపల్లి టోల్‌ప్లాజా ప్రారంభం

ముమ్మిడివరం: జాతీయ రహదారి 216లోని అన్నంపల్లి వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను ఆ సంస్థ మేనేజర్ జె.హనుమంతరావు ప్రారంభించారు. ఈ టోల్‌ప్లాజా పరిధిలో రోడ్డు విస్తరణ పనులు ఇంకా పూర్తికాకపోయినా ఆకస్మికంగా టోల్ ఫీజులు వసూలు చేయడంపై వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి 216లోని గురజనాపల్లి నుంచి పాశర్లపూడి వరకూ 61 కిలోమీటర్ల మేర ఈ టోల్‌ప్లాజా పరిధిలోకి వస్తుంది. అయితే ఇంకా రహదారు పనులు పూర్తి కాలేదు. దీనిపై కాంట్రాక్టు మేనేజర్ హనుమంతరావును విలేకరులు వివరణ కోరగా టోల్‌గేటు పరిధిలో ఇంకా పనులు పూర్తికావాల్సి ఉందని, మూడు నెలల్లో పూర్తవుతాయన్నారు. టోల్‌గేటు 20 కిలోమీటర్లు లోకల్ పరిధిలోకి వస్తుందని సొంతవాహనదారులు అమలాపురం ఆర్టీఓ కార్యాలయంలో వాహనాల రిజిస్ట్రేషన్ చేయించుకుని నెలకు రూ.315 చెల్లిస్తే ఎన్నిసార్లయినా రాకపోకలు సాగించవచ్చన్నారు.

కలసికట్టు మాట.. అదే అభివృద్ధి బాట


రావులచెరువు శ్మశానంలో నిర్మించిన తపో దీక్షలో ఉన్న శివుడు విగ్రహం


శ్మశానంలో నిర్మించిన వైకుంఠ మహా ప్రస్థానం భవనం


గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామస్తులు

- ఐకమత్యంతో ఉన్న రావులచెరువు ప్రజలు
- సమష్టిగా నిర్ణయాలు.. జరుగుతున్న పనులు
- మౌలిక సదుపాయాల కల్పన

అమలాపురం టౌన్: రావులచెరువు అమలాపురం మున్సిపాలిటీ 30వ వార్డులో ఉన్న ప్రాంతమిది. ఈ ప్రాంతంలో దాదాపు 3 వేల మంది ప్రజలు ఉన్నారు. వారందరూ కలిసికట్టుగా ఉంటూ గ్రామ అభివృద్ధి కమిటీగా ఏర్పడి ఐక్యమత్యాన్ని చాటుతున్నారు. తమ ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సమిష్టిగా గుర్తించి, వాటిపై చర్చించి అంతా ఒక్కటై నిర్ణయం తీసుకొని విరాళాలతో సొంతంగా పనులు చేసుకుంటున్నారు. దేనినైనా సంఘటితంతో సాధించవచ్చన్న మాటకు రావుల చెరువు అభివృద్ధి కమిటీ అద్దం పడుతోంది. వారందరిదీ ఒకే మాట.. అదే అభివృద్ధి బాట అన్నట్టుగా వారి నిర్ణయాలు ఉంటాయి.

రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులు

రావుల చెరువు అభివృద్ధి కమిటీ ఏర్పాటై ఏడాదయ్యింది. ఇప్పటికే సమిష్టి నిర్ణయాలతో, దాతల విరాళాలతో ఆ ప్రాంతంలో దాదాపు రూ.20 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి అందులో కొన్నింటిని పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతం చేసింది.

అభివృద్ధి పనులు ఇవే..

రావులచెరువు ప్రజలకు సరైన శ్మశానం లేక ఉన్న స్థలంలో అడుగు పెట్టేందుకు వీలు లేనంత అధ్వానంగా ఉండేది. దీంతో అక్కడి ప్రజలు రూ.9.30 లక్షలతో వైకుంఠ మహా ప్రస్థానం పేరుతో వసతులతో కూడిన శ్మశానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అందులో రూ.3 లక్షలతో తపో దీక్షలో ఉన్న పరమ శివుడి విగ్రహాన్ని నెలకొల్పారు. రూ.6.30 లక్షలతో మహా ప్రస్థానాన్ని ఓ భవనంగా నిర్మించి అందులో శవానికి అంత్య క్రియలు చేసుకునేందుకు వీలుగా బెడ్ నిర్మించారు. ఈ శ్మశానికి వెళ్లే మార్గంలో ఓ దాత సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో ఆర్చ్ నిర్మాణం చేపడుతున్నారు. అలాగే శ్మశానంలో కర్మకాండలు చేసుకునేందుకు, అస్థికలు భద్రపరుచుకునేందుకు రూ.3 లక్షల విరాళాలతో షెడ్డు నిర్మాణం జరుగుతోంది. అలాగే గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకోదండ రామాలయం పేరుతో కల్యాణ మండపాన్ని రూ.5లక్షలతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈనెల ఒకటో తేదీన ఈ కల్యాణ మండపం నిర్మాణానికి గ్రామస్తులు సమష్టిగా శంకుస్థాపన చేశారు. త్వరలోనే ఓ పార్కును నిర్మించుకునేందుకు, పక్కా డ్రైనేజీ వ్యవస్థ రూపకల్పనకు, తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను ఏర్పాటుకు గ్రామ కమిటీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. కమిటీ ప్రతినిధులు గుత్తుల సూర్యనారాయణ, గొవ్వాల అచ్యుతరామయ్య, పాటి ప్రభాకర్, గొవ్వాల నాగరాజు, పెంకే రాంబాబు తదితరులు ఇస్తున్న సంఘీభావం పిలుపుతోనే ఊరంతా ఒకే తాటిపై వచ్చి ఒకే మాటపై నడుస్తోంది.

ఐక్యమత్యమే మా అభివృద్ధి రహస్యం



రావులచెరువులో వరసగా ఇన్ని అభివృద్ధి పనులు ప్రజల సహకారం, సమష్టి నిర్ణయాలతో చేపడుతున్నామంటే దానికి అసలు రహస్యం మాలో ఉన్న ఐక్యమత్యమే. ఊరంతా ఒకే మాట ఒకే బాటగా ముందుకు సాగుతున్నామంటే అది రావులచెరువు ప్రజల గొప్పదనం. అభివృద్ధి కమిటీలో ఉన్న పెద్దల నిర్ణయాలు, ఆలోచన్లు ఎప్పుడూ గ్రామానికి ఎలాంటి మౌలిక సదుపాయాల కల్పించాలన్న దానిపైనే ప్రజల ఏకాభిప్రాయంతో చర్చించుకుంటాం.

– గొవ్వాల నాగరాజు, అభివృద్ధి కమిటీ సభ్యుడు, రావులచెరువు

సహనంతో ఆలోచిస్తే సమస్యలు తలెత్తవు



మహిళా చట్టాలపై మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శైలజ

అల్లవరం: ఓర్పు, సహనమే మహిళలకు శ్రీరామ రక్షని, సహనంతో ఆలోచిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అల్లవరం మండల మహిళా సమాఖ్య కార్యలయంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి శైలజ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో నా పాత్ర ఏమిటీ అనే విషయాన్ని ప్రతి మహిళా తెలుసుకుని బాధ్యతగా వ్యవహరించాలని వివరించారు. కుటుంబ వ్యవస్థలో భార్య అత్యంత కీలకమని, కుటుంబంలో చిన్న సమస్యలు వస్తే ఓర్పుతో పరిష్కరించుకోవాలన్నారు. మహిళలకు రాజ్యాంగం అనేక చట్టాలను రుపొందించిందని, ప్రత్యేక కోర్టు అందుబాటులో ఉందని శైలజ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాదు, ఎంపీడీఓ జి.సరోవర రావు, ప్యానల్ అడ్వకేట్ కళా వెంకటరావు, కేవీవీ శ్రీనివాస్, ఏపీఎం సయ్యద్, కార్యదర్శి రాజ్ మోహన్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

తీరప్రాంత రక్షణ కవచం మడ అడవులు


మడ ప్లాంటేషన్ వేయాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈసీఎఫ్ డైరెక్టర్ చలపతిరావు

కాట్రేనికోన: ప్రకృతి వైపరీత్యాలు తుపానులు, సునామీల నుంచి తీరప్రాంతాలకు మడ అడవులు రక్షణ కవచాలుగా నిలుస్తున్నాయని గ్రీన్ క్లైమెంట్ ఫండ్(ఈసీఎఫ్) ప్రాజెక్టు డైరెక్టర్ పి.చలపతిరావు అన్నారు. శనివారం అటవీ శాఖ సిబ్బందితో కలిసి కందికుప్ప అటవీ సెక్షన్ పరిధిలోని మడ అడవులు ఆయన పరిశీలించారు. కందికుప్ప అటవీ సెక్షన్ పరిధిలో టాక్టరుపై సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణించి మడ అడవులు పరిరక్షణకు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 40–60 శాతం నిధులతో మడ అడవులు అభివృద్ధి, పరిరక్షణ కోసం ఈసీఎఫ్ ప్రాజెక్టుతో పనులు చేపట్టినారు. రాష్ట్ర వ్యాప్తంగా మడ అడవులు అభివృద్ధికి ఈసీఎఫ్ ప్రాజెక్టు పరిధిలో అటవీశాఖ పనులు చేపట్టింది. కందికుప్ప అటవీ సెక్షన్ మడ మొక్కలు ప్లాంటేషన్ చేసేందుకు చానల్ వర్క్ పనులను ఆయన పరిశీలించారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా, ఏలూరు, మచిలీపట్నం, బాపట్ల డీఎఫ్ఓలు ఐకేవీ రాజు, ఎంవీ ప్రసాదరావు, రవీంద్ర దామ, కె.రాజశేఖర్, బీమయ్యలకు మడ అడవులు అభివృద్ధి, పరిరక్షణపై శిక్షణ నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ బృందం సాక్రమెంట్ లైట్‌హౌస్ ప్రాంతంలో ఆలీవ్ రిడ్లే సముద్ర తాబేళ్ల పరిరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు వరప్రసాద్, సుజాత, హరికుమార్, రాఘవ, డీఆర్ఓలు నాగసత్యనారాయణ, సిబ్బంది పట్టాభి, రామిరెడ్డి, సాయిబాబా, ప్రసాద్, వీవీఎస్ చైర్మన్ రేవు భైరవమూర్తి తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంకు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలో రూ.20 కోట్లతో చేపడుతున్న తాగునీటి ప్రాజెక్ట్‌లో భాగంగా స్థానిక గాంధీనగర్‌లో నిర్మిస్తున్న 500 కేఎల్ వాటర్ ట్యాంకు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు శనివారం పరిశీలించారు. వాటర్ వర్క్ నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో జరగాలని ఇంజినీర్లకు చైర్‌పర్సన్ సూచించారు. తాగునీటి ప్రాజెక్టులో మూడు ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నామని కమిషనర్ నాయుడు తెలిపారు. గాంధీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఏవీఆర్ నగర్‌లో వీటిని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్య డీఈఈ గంగరాజు, 10వ వార్డు కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి ఈ పనులను పరిశీలించారు.

నీటి ప్రవాహం నిలిచి చేపలు చనిపోతున్నాయి


చనిపోయిన చేపను పరిశీలిస్తున్న జేడీ లాల్‌మహ్మద్

సాక్షి ఎఫెక్ట్

ఉప్పలగుప్తం: నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ఆక్సిజన్ సరిపోక సముద్ర పర్రలో చేపలు చనిపోతున్నాయని మత్స్యశాఖ జేడీ షేక్ లాల్‌మహ్మద్ అన్నారు. శనివారం 'స్వాంపు ఏరియాలో తరచూ చనిపోతున్న చేపలు' అనే శీర్షికతో ప్రచురితమైన సాక్షి కథనానికి స్పందించి ఆయన శనివారం ఎస్.యానం తీరప్రాంతంలోని స్వాంపు ఏరియాను పరిశీలించారు. ఆయనకు స్థానిక గ్రామ మత్స్యకారులు గత కొన్ని రోజులుగా చేపలు, రొయ్యలు తరచూ చనిపోతున్న పరిస్థితిని వివరించారు. ఈ విషయంపై చనిపోయిన చేపలను జేడీ పరిశీలించారు. స్వాంపులో ఉన్న వాటర్‌ను నమూనా సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. లంకే శ్రీను, భీమరాజు, చిరంజీవి, మూదే దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు

అమలాపురం రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌బ్ల్యూఎస్ అధికారులను ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంచినీటి సమస్యపై సాకుర్రు సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, భట్నవిల్లి సర్పంచ్ తిరుకోటి సుజాత, ఎంపీటీసీ గుత్తుల అనిత, పేరూరు అగ్రహారం ఎంపీటీసీ సుబ్బిరామ్ మాట్లాడారు. ఈ గ్రామాలకు తాగునీరు అందించాలని కోరారు. వెంటనే చర్యలు తీసుకుంటామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చినబాబు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో విజయ ప్రసాద్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం తాగునీటికే ఖర్చు చేస్తున్నామన్నారు. పేరూరు, తాండవపల్లి, చిందాడగరువు, రోళ్లపాలెం గ్రామాల్లో సాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలంటూ ఏఈ రెహమాన్‌కు ఎంపీపీ భాగ్యలక్ష్మి సూచించారు.

ఈదరపల్లి పోలేరు అమ్మవారి ఆలయ భూమి 2.5 ఎకరాలను ఆర్టీసీకు గతంలో లీజుకు ఇచ్చారని, ఆలయానికి శిస్తు ఎందుకు చెల్లించాడంలేదని సొసైటీ అధ్యక్షుడు అడపా బాబూలు ఆర్టీసీ అధికారిని ప్రశ్నించారు.

బండారులంక సర్పంచ్ పెనుమాల సునీత బండారులంక హైస్కూల్లో ముగ్గురు ఉపాధ్యాయుల కొరత ఉందని ప్రస్తావించాగా ఆ స్కూల్లో ఉపాధ్యాయులను నియమించామని ఎంఈఓ సూర్యప్రకాష్ చెప్పారు. జెడ్పీ బాలుర, పేరూరు ఉన్నత పాఠశాలల్లో భారీ వాటర్ ఫిల్టర్లు ఎందుకు మూలన పెట్టేసారంటూ ఎంఈఓను జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్ గోపాల్, ఎంపీపీ భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. వన్నెచింతలపూడి హైస్కూల్‌కు ల్యాబ్ మంజూరు చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఎందుకు ఉపయోగించడం లేదంటూ ఎంఈఓను నిలదీశారు.

ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పలు శాఖల అధికారుల గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు.

'పది' విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పరీక్షలు

అమలాపురం టౌన్: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పేరుతో కోనసీమ వ్యాప్తంగా పలు ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తోంది. ఈనెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ ఈ పరీక్షలను ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, బి.గౌతమ్ తెలిపారు. ఇందులో భాగంగా అమలాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైనవారికి పట్టణ, మండల, జిల్లా స్థాయిల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరుని కల్యాణం


స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, స్నేహ దంపతులు


యానాం పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే అశోక్ దంపతులు

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణం శనివారం వేదమంత్రోచ్చారణ, భక్తజన సందోహం మధ్య కన్నుల పండువగా జరిగింది. చారిత్రక రెడ్డిరాజుల కాలం నాటి మీసాల వెంకన్న బాలాలయం ఆవరణలో ఉదయం 9.45 నుంచి దివ్యకల్యాణ మహోత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కరకుదురుకు చెందిన గోపాలాచార్యులు పర్యవేక్షణలో చింతా వెంకటసుబ్బారావు కుమారుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. కల్యాణంలో యానాం ప్రజల తరపున ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, లక్ష్మీస్నేహ దంపతులు ముత్యాల తలంబ్రాలు, మంగళ సూత్రాలు స్వామివారికి సమర్పించారు. అదేవిధంగా పుదుచ్చేరి ప్రభుత్వం తరపున ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణన్ స్వామివారికి పట్టు పీతాంబరాలు, సువర్ణయజ్ఞోపవీతం సమర్పించారు. కల్యాణానికి యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రఘునాయగం, ఎస్సై శేరు నూకరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, నాయకులు పండు సిద్ధార్థ కుమార్, నక్కల సుబ్బన్న, అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, వినోదాచార్యులు, నరసింహాచార్యులు, సాయిరామకృష్ణా చార్యులు, రాజగోపాలా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

8న ఏఐవైఎఫ్ ప్రాంతీయ సమావేశం

అమలాపురం టౌన్: ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) జిల్లా కమిటీ సమావేశం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగింది. జిల్లా కన్వీనర్ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈనెల 8వ తేదీన విజయవాడలో ఏఐవైఎఫ్ ప్రాంతీయ సమావేశం జరుగుతుందని జిల్లా కన్వీనర్ బాలకృష్ణ వెల్లడించారు. ఈ ప్రాంతీయ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా సంస్థ కార్యకర్తలు పాల్గొవాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ఏఐవైఎఫ్ రాష్ట్ర, జిల్లా మహాసభలు జరగున్నాయని తెలిపారు. ఈ సభలకు ముందు నిర్వహించే శిక్షణలో సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నాలన్నారు.

పోలీసుల అదుపులో నలుగురు యువకులు

అల్లవరం: గోడితిప్ప పంచాయతీ పరిధిలోని గోపాయిలంక లాకు వద్ద శనివారం సాయంత్రం నలుగురు యువకులు గంజాయిని సేవిస్తుండగా అల్లవరం ఎస్సై శ్రీనునాయక్ దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ నలుగురు యువకుల వివరాలు పోలీసులు వెల్లడించలేదు. గంజాయిని ఎవరూ సరఫరా చేస్తున్నారు, ఎక్కడ నుంచి వస్తుంది అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఘటనా స్థలంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పట్టణ సీఐ ఏసీబీకి బదిలీ

అమలాపురం టౌన్: పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు ఏసీబీకి బదిలీ అయ్యారు. తొలుత సీఐ కొండలరావు మంగళగిరిలోని ఏసీబీ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఆయనకు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చేది నిర్ణయిస్తారు. కొండలరావు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పాటయ్యాక అమలాపురం పట్టణ సీఐగా వచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా కొన్ని రోజుల తర్వాత అమలాపురం నుంచి సీఐ రిలీవ్ కానున్నారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్: స్థానిక ఎంప్లాయీస్ హోమ్‌లో సీఐటీయూ అమలాపురం మహాసభ పట్టణ నాయకురాలు పి.అమూల్య అధ్యక్షతన శనివారం జరిగింది. జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, తొలుత కార్మిక స్థితిగతులపై చర్చించింది. వచ్చే ఏప్రిల్ 3వ తేదీన జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభ సీఐటీయూ అమలాపురానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షురాలిగా కె.రమాదేవి, కార్యదర్శిగా పి.అమూల్య, కోశాధికారిగా ఇ.విజయతోపాటు మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

మంత్రి విశ్వరూప్ పరామర్శ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: అస్వస్థతకు గురై అమలాపురం సాయి సంజీవిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ జిన్నూరి వెంకటేశ్వరరావును మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య సమాచారం మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆ ఆస్పత్రి వైద్యులతో కూడా మాట్లాడారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవింద శెట్టి తదితరులు ఉన్నారు.

ముమ్మిడివరంలో అధికారుల పర్యటన

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి ఎన్.కిరణ్‌కుమార్ శనివారం పర్యటించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, డంపింగ్ యార్డులను పరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడం, సమీపంలోని డంపింగ్ యార్డులో వ్యర్థాల నుంచి పొగ రావడాన్ని గుర్తించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగ వల్ల వాతావరణం కలుషితమవుతుందని, పొగ రాకుండా చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. పల్లవారి పాలెంలో కమ్యూనిటీ టాయిలెట్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్ సి.హెప్సి జోన్స్, కమిషనర్ జి.లోవరాజు, ఏఈ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్ రాజు, శానిటరీ సెక్రటరీలు, వలంటీర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.40 వేల విరాళం


దాతలకు స్వామివారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పట్టణానికి సత్య దేవ ఏజెన్సీస్ యజమానులు వేటుకూరి సుబ్బరాజు, కృష్ణంరాజు సోదరులు రూ.40 వేల విరాళం శనివారం సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవికి అందజేశారు. అనంతరం ఆ దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం

యానాం: రెడ్డిరాజుల కాలం నాటి, ఆరు వందల ఏళ్ల చరిత్ర కలిగిన భూసమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం కూల్చివేసినప్పటికీ ఏళ్లు గడుస్తున్నా నూతన ఆలయం నిర్మాణం పూర్తికాకపోవడం చాలా దురదృష్టకరమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం స్వామివారి కల్యాణం అనంతరం ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. స్వామివారి ఆలయానికి సంబంధించి తాను మద్రాసు హైకోర్టులో కేసు వేశామని, దీనివల్ల ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న దేవస్థానం కమిటీని రద్దు చేసి ఆలయ నిర్వహణ, వ్యవహారాలు, బ్యాంకు అకౌంట్లు తదితర వాటిని డిప్యూటీ తహసీల్దార్ తదితర రెవెన్యూ అధికారులకు అప్పగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చిందన్నారు. కేసు వేయడానికి ప్రధాన కారణం దేవాలయం నిర్మాణం ప్రభుత్వం, అధికారులతో రాజకీయాలకు తావులేకుండా జరగాలని భావించేలా వేసినట్టు చెప్పారు. ఆలయ నిర్మాణ బాధ్యత శాసనసభ్యుడిగా తనకు ఎంత ఉందో అదే విధంగా భక్తులకు, యానాం ప్రజలకు సైతం ఉందని, తన వంతు సహకారం పూర్తిగా ఉంటుందన్నారు.